


# హెడ్ వెంకటస్వామి

అప్పుడే భోంచేసి అగ్గిపుల్లతో పళ్లు కుట్టుకుంటున్నాడు హెడ్ వెంకటస్వామి. ఇంతలో కానిస్టేబులు కనకారావు కుర్చీ తెచ్చి టేబులుమీద పెట్టాడు. కుర్చీ వేసుకొని చొక్కా జేబులోంచి చార్మినార్ సిగరెట్టు పెట్టె తీసి ఒక సిగరెట్టు ముట్టించాడు. గుండెల నిండా పొగ పీల్చి వదిలాడు. ఎదురు గుండా వున్న ద్వారంలోంచిరోడ్డుమీదికిచూస్తూ ఆలోచిస్తున్నాడు.

వెంకటస్వామికి పందొమ్మిదేళ్ల సర్వీసు వుంది. ఈ సరికి అతడికి యస్. ఐ. ప్రమోషను రావలసిందే. కాని, అతడి గీత బాగు లేకో, అధికార్ల చూపు చల్లగా లేకో ఇంత వరకు ప్రమోషను రాలేదు. అతడి పందొమ్మిదేళ్ల సర్వీసులో చెప్పుకోతగ్గ ఘనకార్యాలు ఏవీ చెయ్యలేదు. అతడికి అటువంటి అవకాశాలూ రాలేదు. పై ఆఫీసర్లకి వెంకటస్వామిమీద ప్రత్యేకమయిన అభిప్రాయం ఏదీ లేదు. ఇంతకు ముందు వెంకటస్వామికి స్వేచ్ఛ ఉండేది కాదు. యస్. ఐ. క్రింద ఉండి అతడు చెప్పినట్టు చెయ్యవలసి వచ్చేది. అందులో ఏదైనా ప్రత్యేకత ఉంటే అది ఆ యస్. ఐ. కి దక్కేది. ఇప్పుడలా కాదు. వెంకటస్వామి ఆ చిన్న "అవుట్" పోలీసు స్టేషనుకు "ఇన్‌ఛార్జి". అతని క్రింద పలుగురు కానిస్టేబుల్లు ఉన్నారు. అతడు ఇప్పుడు ఏ పని చేసినా కొంత స్వతంత్రంగా చేయొచ్చు. మంచి కేసులు రెండు పట్టుకుంటే ఆ ఘనత తనకి దక్కుతుంది. తరువాత యస్. ఐ. ప్రమోషనూ వస్తుంది. అందుకే ప్రస్తుతం యస్. ఐ. ప్రమోషను రాకపోయినా, "అవుట్ పోలీసు స్టేషను ఇన్‌ఛార్జి" గా వచ్చినందుకు కొంత తృప్తిగానే ఉంది వెంకటస్వామికి.

అదొక చిన్న గ్రామం. చిన్నా పెద్దా కలిసి సుమారు ఐదువందలి కొంప లుంటాయి. అది పార్వతీపురం రాయగడ రోడ్డుమీద పార్వతీపురానికి తొమ్మిదిమైళ్ల దూరంలో వుంది. గ్రామం చిన్నదైనా అది పదిహేను గిరిజన గ్రామాలకి కేంద్రం. నిజానికి అక్కడ పోలీసు స్టేషను అవసరం లేదు. కాని ఆ మధ్య నక్సలైట్ల ఉద్యమం ఆ ప్రాంతంలో ఉండటంవల్ల అక్కడ పోలీసు స్టేషను అవసరమొచ్చింది. రెండు సంవత్సరాల క్రితం దాక అక్కడ ఒక ప్రత్యేక పోలీసుదళం కూడా ఉండేది. ఆ వూరు ఒరిస్సా ఆంధ్ర సరిహద్దుల్లో వుండటంవల్ల అక్రమ రవాణా అరికట్టేందుకు కూడా అక్కడ పోలీసు స్టేషను అవసరమయింది.

పోలీసు స్టేషన్లో రెండు గదులున్నాయి. చుట్టూ వెదురు బద్దల కంచె వుంది. ముందు తాటి కమ్మలతో పందిరి వేశారు. ముందుగది కొంచెం పెద్దగది. దానివెనుక లాకప్ గది. పెద్దగది మధ్యలో ఒక టేబులు. టేబులుకి రెండు వైపులా ఒక కుర్చీ ఒక పొడుగు బెంచీ ఉన్నాయి. గదికి ఒక మూల ఒక పెద్దక్కర పెట్టె వుంది. అది "రికార్డు" బాక్సుగా వాడుతున్నారు. మరొకమూల రెండు తుపాకులు బాయ్‌నెట్లతో నిలబెట్టబడ్డాయి.

కానిస్టేబులు కనకారావు ఆ వూళ్లో నాలుగు సంవత్సరాలుగా వుంటున్నాడు. వచ్చిన ఇన్‌ఛార్జీ లందరికి కుడిభుజంలా పని చేస్తుంటాడు. అతడికి ఆ వూరు, ఆ పరిసర ప్రాంతాలు, ఆ వూరి మనుషులు క్షుణ్ణంగా తెలుసు.

"కనకారావ్! అలా వూళ్లోకి వెళ్లి చూసొద్దామా?" ఊరిని చూడాలని అభిప్రాయంతో అన్నాడు వెంకటస్వామి.

"ఏం వూరు సార్! ఒక రోడ్డా, ఒక తీరా తెన్నా ఏమిటి చూస్తాం?" పెదవి విరిచాడు కనకారావు.

"చూడ్డానికి కాదు. ఊరు స్వరూపం ఎక్కడ ఏది వుందో తెలుసుకోవాలిగదా!"

"సరే! పదండి." దారితీశాడు కనకారావు.

ఇద్దరు వెదురు కంచె దాటి బయటికి వచ్చారు. పోలీసు స్టేషనుకి ఎదురుగా చెరువు వుంది. చెరువుగట్టు దిగువున ఎడంప్రక్క నాలుగు పోలీసు క్వార్టర్సు వున్నాయి. వాటికి ఎదురుగా వెంకటస్వామి క్వార్టరు వుంది. చెరువుకి మూడు పక్కలా అడ్డదిడ్డంగా విస్తరించిన పెద్ద పెద్ద కొండలు గంభీరంగా నిలబడివున్నాయి. పోలీసు క్వార్టర్సు వెనుక నుండి సన్నని తారురోడ్డు చెరువును చుడుతూ కొండల్లోకి చొచ్చుకుపోతుంది.

ఇద్దరూ క్వార్టర్సు ప్రక్క నుండి తారురోడ్డు మీదికి వచ్చారు. రోడ్డుకి రెండుప్రక్కలా చిన్న చిన్న దుకాణాలు వున్నాయి. దుకాణాల తరువాత రోడ్డుకి ఎడంప్రక్క "బస్సు షెల్టరు" వుంది. దాన్ని పార్వతీపురం లయన్స్ క్లబ్బు మెంబరు వాళ్ళ నాన్నగారి జ్ఞాపకార్థం కట్టించాడు.

రోడ్డుమీద నడుస్తున్న క్రొత్త హేడ్‌ని జనమంతా భయభక్తులతో చూస్తున్నారు. కొంతమంది నమస్కారాలు పెడుతున్నారు. వెంకటస్వామి నమస్కారాలందుకుంటూ గంభీరంగా ముందుకు నడుస్తున్నాడు. వెంకటస్వామిది గంభీరమైన విగ్రహం. అయిదడుగుల పది అంగుళాల పొడుగు. పొడుక్కితగ్గ లావు. బలమైన శరీరం. వెడల్పాటి ముఖం. పొట్టిగా దళసరిగా కత్తిరించిన మీసాలు దట్టమైన కనుబొమలు. లోతుకుపోయి తీక్షణంగా చూసే కళ్ళు. ఎదుటి వారిలో భయం, గౌరవం కలిగిస్తాయి. హేడ్ కానిస్టేబుల్ యూనిఫారమ్ మరింత గంభీరతను తెచ్చిపెట్టింది.

ఇద్దరూ నడుస్తూ బస్సు షెల్టరు దగ్గర ఆగారు. ఇంతలో రాయగడ నుండి పార్వతీపురానికి వెళ్లే బస్సు వచ్చి ఆగింది. ఒక పాసంజరు దిగాడు. ముగ్గురు పాసంజర్లు ఎక్కారు.

"వస్తార్సార్?" వినయంగా అడిగాడు హేడ్ డ్రెస్‌లో వున్న వెంకటస్వామిని చూసి బస్ కండక్టరు.

వెంకటస్వామితోపాటు కనకారావు తల అడ్డంగా తిప్పారు. అంతవరకు ఫుట్‌బోర్డుమీద ఒక కాలు, నేలమీద ఒక కాలు వేసి నిలబడిన క్లీనరు లోపలికి ఎక్కుతూ "రైట్" అన్నాడు.

డ్రైవరు గేరు మార్చాడు.

"ఆపు!" అన్న మాట కొంచెం ముద్దగా అధికారయుతంగా వినిపించింది.

## రు. 600 బహుమతి పొందిన కథ

బస్సు డ్రైవరుతోపాటు వెంకటస్వామి, కనకారావులు అటు చూశారు. గవర్నమెంటు సారా దుకాణం నుంచి అప్పుడే బయటికి వస్తున్న కాళిదాసు కనిపించాడు. బస్సు సుమారు పదిగజాలు ముందుకెళ్లి ఆగిపోయింది.

"వాడే సార్! రౌడీ, కేడీ, కాళిదాసు!" చిన్నగా గొణుగుతున్నట్టుగా అన్నాడు కనకారావు.

"కాళిదాసా?...' ప్రశ్నార్థకంగా కనకారావు వైపు చూశాడు వెంకటస్వామి.

కాళిదాసు సారాకొట్టు నుండి బయటికి వచ్చి ప్రక్కనే వున్న కిళ్లీకొట్టు దగ్గర నిలబడ్డాడు. ఇనపగజానికి వేలాడుతున్న రెండు చేగోడీలు తీసుకొని ఒక ముక్క నోట్లో వేసుకున్నాడు.

"రే! ఎంకటి! కిళ్లీ కట్టూ!" ముద్దగా, కటువుగా వున్నాయి మాటలు.

"ఒకటా! రెండా!" భయంగా అడిగాడు వెంకటి.

"రొండు! బీడీకట్ట... అగ్గిపెట్టె."

వెంకటి ముఖంలో రంగులు మారాయి. దీపం పెట్టగానే యీ ముదనష్టపు యమ్. యస్. బేరం వచ్చినందుకు మనసులో తిట్టుకుంటూ పైకి నవ్వు ముఖం పెట్టుకొని రెండు కారాకిళ్లీలు, బీడీకట్ట, అగ్గిపెట్టె అందించాడు.

అప్పటికి చేగోడీలు తినడం పూర్తిచేసి ఒక కిళ్లీ వేసుకొని మిగతావి జేబులో వేసుకొని ప్రక్కనే వున్న చిల్లరకొట్టుకి వెళ్లాడు.

"వాడు పెద్ద రౌడీ సార్! యీ ఊరేకాదు, యీ చుట్టుప్రక్కలంతా కాళిదాసంటే హడల్. వాడికి ఎవరూ ఎదురుచెప్పరు." అంతవరకూ కాళిదాసునే చూస్తున్న వెంకటస్వామితో అన్నాడు కనకారావు.

"కాళిదాసు..." గొణుక్కున్నాడు వెంకటస్వామి. ఎక్కడో పేరు విన్నట్టుంది. అవును! కాళిదాసు పెద్ద క్రిమినల్... జిల్లా పోలీసాఫీసులో కూడా కాళిదాసు ఫైలు వుంది. గుర్తుకొచ్చింది వెంకటస్వామికి.

"ఏరా! ఏడ్రా నీ బాబు?" చిల్లరకొట్లో కూచున్న పన్నెండేళ్ల సాహుకారు కొడుకుని పెద్దగా అరిచినట్టు అడిగాడు.

"వస్తున్నా! నువ్వా కాళిదాసు! ఏమిటిలా వచ్చావు?" లోపల్నించి వస్తూ వినయం ఉట్టిపడేలా అడిగాడు షాహుకారు.

"ఆఁ!... అయిదురూపాయలు కావాలి!"

ముందే ఊహించిన షాహుకారు కాళిదాసు సంగతి పూర్తిగా తెలిసినవాడవటంచేత గల్లా పెట్టెలోంచి ఒక రెండురూపాయల నోటు, మూడు ఒక రూపాయనోట్లు తీసి మళ్లీ లెక్కపెట్టి మడిచి కాళిదాసు చేతిలో పెట్టాడు.

కొట్లోవున్న గాస్‌లైటు వెలుగులో స్పష్టంగా కనిపిస్తున్నాడు కాళిదాసు. ముడుకులమీదికి కట్టిన పంచె. ఒంటిమీద కాకీ కమీజు. భుజంమీద ఏ రంగో స్పష్టంగా చెప్పలేని తువ్వాలు. సుమారు అయిదడుగుల మూడంగుళాల పొడుగు. అంత లావు సన్నంకాని శరీరం. చప్పిడిముక్కు, పెద్ద నోరు. చిన్నచెవులు, పల్చని కనుబొమలు, మూసుకు పోతున్నట్టున్న చిన్న కళ్లు. చూసినవాళ్లకి అమాయకుడిలా కనిపిస్తాడు. పేరుమోసిన రౌడీ అంటే ఎవరూ నమ్మరు.

వెంకటస్వామికి అదే అనుమానం వచ్చింది. నమ్మలేనట్టుగా కనకారావు వైపు చూశాడు.

తాగిన సారా పంటబట్టింది. తూలుతూ అడుగులువేస్తూ కనకారావుని రాసుకుంటూ అంతవరకు యింజన్ ఆన్‌చేసి వుంచిన బస్సు ఎక్కాడు కాళిదాసు.

వెంకటస్వామి అనుమానం అర్థమయింది, కనకారావుకి.

"నిజమే సార్! వాడు పైకి అలా కనిపిస్తాడు గాని చాలా డేంజరస్. ఎవడైనా యెదురుతిరిగితే వాడి రక్తం కళ్లచూడందే వదలడు. అందుకే వీళ్లందరికి భయం. వాడు యేది కావాలంటే అది మారుమాట్లాడకుండా యిచ్చేస్తారు. వాడికి యిష్టంవుంటే తిరిగి యిస్తాడు. లేకపోతే లేదు. అడిగే ధైర్యం యెవరికీలేదు. మీరూ చూశారుగా?"

"ఔను!" ముక్తసరిగా అన్నాడు వెంకటస్వామి. ఆలోచిస్తున్నాడు.

"అందరూ వాడి వెనక తిట్టుకున్నవాళ్లేగాని వాడి ముందు పల్లెత్తుమాట అనరు." మళ్లీ అన్నాడు కనకారావు.

"మరి ఊరివాళ్ళందరూ యేకమై యేదైనా చెయ్యొచ్చుగా!"

"చెయ్యవలసినవన్నీ చేశారు. వాడు దేనికీ లొంగలేదు." కనకారావు ఆ వూళ్లో నాలుగేళ్లబట్టి వుండటంవల్ల కాళిదాసు సంగతి అతడికి బాగా తెలుసు. కాళిదాసంటే కనకారావుకి భయమే.

"ఇంతకుముందున్న మనవాళ్లంతా ఏం చేసినట్టు?" సాలోచనగా అడిగాడు వెంకటస్వామి.

"ఏదైనా చెయ్యాలని చూసి ఏమీ చెయ్యలేక వదిలేశారు." మీరుకూడా ఏం చెయ్యలేరు—వాడి జోలికి వెళ్ళకండి అన్న భావంతో అన్నాడు కనకారావు.

"అంత గట్టివాడా!" కొంచెం ఆశ్చర్యంతో అన్నాడు వెంకటస్వామి.

"పోను పోను మీకే తెలుస్తుంది. మన ఫైళ్లనిండా వాడి ప్రతాపమే!"

"సరే! చూద్దాం!" ఆలోచిస్తూ స్టేషనుకి దారితీశాడు వెంకటస్వామి.

ఇద్దరూ స్టేషనుకి చేరుకున్నారు. హరికేన్ లాంతరు వెలిగించి టేబిలుమీద పెట్టాడు కనకారావు. గదిలో మూలగా వున్న రికార్డుబాక్సు తాళంతీసి కొన్ని ఫైల్సు తెచ్చి వెంకటస్వామి ముందు పెట్టాడు.

వెంకటస్వామి సిగరెట్టు ముట్టించి ఆలోచిస్తున్నాడు.

"ఆ ఫైళ్లు చూడండి సార్! మీకే

బోధపడుతుంది." నిశ్శబ్దాన్ని చీలుస్తూ అన్నాడు కనకారావు.

ముందున్న ఫైళ్ళలో ఒకదాన్ని తీసి దీక్షగా చదివాడు వెంకటస్వామి.

పాలేరు రాముడు మాయం ... రెండురోజుల తరువాత రాముడి శవం బయటపడటం ... శవ పరీక్షలో హత్య అని నిరూపణ ... హంతకునికోసం గాలింపు — అనుమానంమీద కాళిదాసు అరెస్టు ... సరైన సాక్ష్యం లభించనందున కేసు ముందుకి నడవని వైనం — నిరూపణ కానందున కాళిదాసు విడుదల.

"ఇది యెలా జరిగింది ?" కుతూహలంగా అడిగాడు వెంకటస్వామి.

కాళిదాసుకి ముందు వెనక యెవరూ లేరు. పైలాపచ్చీసుగా తిరుగుతుండేవాడు. ఎవరు ఏ పని చెప్పినా చేస్తుండేవాడట. క్రమంగా ఊళ్లోవాళ్ళు కాళీదాసుని తమ స్వప్రయోజనంకోసం వాడుకుండేవారు. రెండు సారాబుడ్లు ఇచ్చి ఒక పదిరూపాయలు చేతిలో పెడితే యెంత పనైనా చేసేవాడు. ఆ విధంగా ముందు కాళిదాసు కిరాయి రౌడీ అయ్యాడు. నరసయ్యగారని యీ ఊళ్ళో పెద్ద మోతుబరి. రాముడు నరసయ్య దగ్గర పాలేరు. నరసయ్య కూతురుకి, రాముడికి అక్రమ సంబంధం వుందని అందరూ అనుకుండేవారు. అది ఒకనాడు నరసయ్య కళ్లబడింది. నరసయ్య బాగా ఆలోచించి అప్పటికే పిల్లరౌడీగా పేరుగాంచిన కాళిదాసుని సారాబుడ్లతోను, డబ్బుతోను ఆశ్రయించాడు. ఆ మర్నాడే రాముడు కనపడలేదు. ఊరి వాళ్లందరికీ ఈ విషయం తెలిసినా కళ్లతో ఎవరూ చూడలేదు. అందువల్ల కాళిదాసుతో విరోధం యిష్టంలేక యెవరూ సాక్ష్యానికి రాలేదు. కోర్టులో కేసు ఋజువు కాకపోవడంతో కాళిదాసుని వదిలేశారు. అప్పటినుండి కాళిదాసుకి కోర్టులన్నా పోలీసులన్నా భయం పోయింది. తనని యెవడూ ఏం చెయ్యలేడన్న ధీమాతో విచ్చలవిడిగా తిరుగుతుండేవాడు. దాంతో అప్పటివరకు పిల్లరౌడీగా వున్న కాళిదాసు పెద్ద రౌడీ అయిపోయాడు.

అంతా విన్న వెంకటస్వామి మరొక ఫైలు అందుకున్నాడు.

కరణం వెంకట్రావుగారింట్లో చోరీ...నగలు, చీరలు, రేడియో, రెండు చేతిగడియారాలు, యెనిమిదివందల రొఖ్ఖం గల్లంతు. కేడీ కాళిదాసు మీద అనుమానం ... పోలీసు నిఘా ... పోయిన వస్తువులకై గాలింపు ... వస్తువుల ఆచూకీ తెలియక సరైన సాక్ష్యం లేక కేసు నిలిచిపోవడం ... కాళిదాసు విడుదల.

మరొక ఫైలు అందుకున్నాడు వెంకటస్వామి.

ఆడదానిమీద అత్యాచారం ... బలత్కారం, నగల అపహరణ ... దీంట్లోకూడా నిందితుడు కాళిదాసే ! యిందుక్కూడా సరైన సాక్ష్యాధారాలు లభించని వైనం. కాళిదాసు విడుదల.

"మనవాళ్ళు సరిగ్గా ఇన్వెష్టిగేషన్ చేసుండరు! అందుకే తప్పించుకోగలిగాడు !" అన్నాడు వెంకటస్వామి.

"లేదు సార్ ! యస్. పి. దొరగారు కూడా యిందులో కల్పించుకున్నారు. మన వాళ్లందరూ నిద్రాహారాలు మాని పని చేశారు. అయినా వాడికి వ్యతిరేకంగా ఏ సాక్ష్యం లభించలేదు. ఎంతచేసినా వాడ్ని పట్టుకొని జైలుకి పంపలేకపోయాం !" అన్నాడు కనకారావు.

మరొక ఫైలు అందుకున్నాడు.

అందులో ఊరివాళ్ళందరూ కలసి వాడి బాధలు భరించలేక జిల్లా కలెక్టరుకి, పోలీసు సూపరెంటుకి పెట్టుకున్న పిటీషను. దానిమీద యింతకుముందు వాడిమీద చాలా కేసుల్లో అనుమానంవల్ల యస్. పి. గారు విచారణకి రావటం, ఈ విషయాన్ని ముందే పసిగట్టిన కాళిదాసు యస్. పి. వచ్చిన ముందురోజు రాత్రే ఊరివాళ్లందర్ని హెచ్చరించడంవల్ల యెవరూ విచారణలో సాక్ష్యం చెప్పడానికి రాకపోవడం. దాంతో పిటిషన్లో వున్న విషయాలు ఋజువు కాకపోవడం. యస్. పి. గారు ఏం చెయ్యలేక తిరిగి వెళ్లిపోవడం...

ఫైళ్ళ ప్రక్కకి జరిపి కనకారావువైపు చూశాడు వెంకటస్వామి.

"అలా ఊళ్లోవాళ్ళకి, మన డిపార్టుమెంటుకి కొరకరాని కొయ్య అయిపోయాడు. వాడి గురించి చెప్పాలంటే యింకా చాలావుంది సార్ ! వాడి సంగతి మనకెందుకు ?" అని ఆవులించాడు కనకారావు.

వెంకటస్వామి ఆలోచిస్తున్నాడు. ఇటువంటి ఖూనీకోర్ని, దొంగని, రౌడీని గనుక పట్టుకుంటే తప్పకుండా తనకి యస్. ఐ. ప్రమోషను వస్తుంది. ఎలా పట్టుకోవడం ? ఎలా యిరికించడం ? తీవ్రంగా ఆలోచిస్తున్నాడు వెంకటస్వామి. ఉన్నవన్నీ ముగిసిన పాతకేసులే...పెండింగ్‌లో యేదీ లేదు... పోనీ క్రొత్త కేసు ఒకటి బనాయిస్తే ... బాగానే వుంటుంది. కాని యెలా ? సిగరెట్టుమీద సిగరెట్టు కాల్చి ఆలోచిస్తున్నాడు. ఆలోచిస్తున్న వెంకటస్వామికి ఒక చక్కని ఆలోచన వచ్చింది.

"కనకారావ్ !..."ఉత్సాహంతో అరచినట్టుగా పిలిచాడు.

కునికిపాట్లు పడుతున్న కనకారావు తుళ్లి పడ్డాడు.

"రేపు పొద్దున్న కిళ్లీకొట్టు వెంకటిని, ఆ షాహుకార్ని స్టేషనుకి తీసుకురా !..."

ముందు ఆశ్చర్యపోయినా తరువాత పోలీసుబుర్ర కాబట్టి అర్థం చేసుకున్నాడు కనకారావు.

"ఎందుకు సార్ ? ఆ కాళిగాడిమీద కేసు బనాయించడానికేనా ?..."

అవునన్నట్టు తలూపాడు వెంకటస్వామి.

"వాడి జోలి మనకెందుకు సార్ ?... వాడి సంగతి పూర్తిగా మీకు తెలియదు. వాడితో వ్యవహారం నిప్పుతో చెలగాటం !..."

కోపంగా చూశాడు వెంకటస్వామి.

"ఇంత పిరికివాడివి నీకు పోలీసు ఉద్యోగం ఎవడిచ్చాడయ్యా ?" కసిరినట్టు అన్నాడు వెంకటస్వామి.

"లేదు సార్ ! నా మాట వినండి. మీ మంచి కోరి చెపుతున్నాను. మునపు మీలాగే అప్పారావుగారని మీకు తెలుసనుకుంటాను యిక్కడ ఇన్‌చార్జీగా ఉండేవారు. ఆతడు మీలాగే వీడ్ని ఏదో ఒకటి చెయ్యాలని ప్రయత్నించాడు. ముందే పసిగట్టిన కాళిగాడు ఆయన ఒక్కడూ ఉండే సమయం చూసి చావగొట్టేడు. దాంతో ఆయన మంచమెక్కి పది రోజులదాకా లేవలేదు. తరువాత చేసేదిలేక అవమానాన్ని భరించలేక ట్రాన్స్ఫరు చేయించుకున్నాడు.

వెంకటస్వామి ముఖం ఆవేశంతో కందగడ్డలా తయారయింది. వెంకటస్వామి పిరికివాడు కాదు. యస్. ఐ. ప్రమోషను కళ్లముందు మెదులుతుంది. పిడికిళ్లు బిగుసుకుపోయాయి. వాడ్ని ఎలాగైనా పట్టుకొని యస్. ఐ. ప్రమోషను పొందాలన్న దృఢ నిశ్చయం ఏర్పడింది.

"కనకారావ్ ! నువ్వు జవానువి. నేను యిన్‌ఛార్జి. నేను చెప్పినట్టు చెయ్యి" దృఢంగా అన్నాడు వెంకటస్వామి.

"అలాగే తీసుకొస్తాను సార్ !" అని మనసులోనే ఖర్మ అనుకున్నాడు కనకారావు.

మర్నాడు పొద్దున్నే కిళ్లీకొట్టు వెంకటి, షాహుకారు వచ్చి వంగి వంగి దండాలు పెట్టి నిలబడ్డారు. వెంకటస్వామి వైపు ఎందుకు పిలిపించాడో తెలియక భయంతో చూస్తున్నారు.

"కూర్చోండి !" పొడుగు బెంచీ చూపించి సౌమ్యంగా అన్నాడు వెంకటస్వామి.

ముందు ఊరి విషయాలు, వ్యాపార విషయాలు అడిగాడు, సూటిగా అసలు విషయంలోకి దిగకుండా వాళ్లలో భయాన్ని పోగొట్టడానికి. దానికి వాళ్ళు తోచిన సమాధానాలు చెప్పారు. వాళ్ల నోటితో వాళ్లే కాళిదాసుని గురించి చెప్పేటట్టు కొన్ని ప్రశ్నలు డొంకతిరుగుడుగా అడిగాడు. వాళ్ళు మాత్రం కాళిదాసు ఊసే తేలేదు.

"చూడండీ ! నిన్న మీ యిద్దరి దగ్గరికి ఒకడు వచ్చి, నీ దగ్గర కిళ్లీలు, బీడీకట్ట, అగ్గిపెట్టె తీసుకున్నాడు. నీ దగ్గర అయిదు రూపాయలు తీసుకున్నాడు కదా !" వాడెవడు ?... అని వెంకటివైపు షాహుకారు వైపు చూసి తెలియనట్టు అడిగాడు.

## ఆచారాలు

ఆచారాలు కురిపిస్తున్నాయి
అలజడుల జడివానలు
చేస్తున్నాయి దాహోదం
అన్యాయాలకు అపోహలకు
ఆచారాల చీకటి ముసుగుల్లో
దాగివున్న సమాజానికి
ఎప్పుడు వస్తుంది సమ సమాజ వెలుగు ?
నవనాగరికులనే అగ్రగణ్యులు
వింత మనస్తత్వాలతో
వేలెత్తి చూపిస్తూ వెక్కిరిస్తుంటే
ఎప్పుడు వస్తుంది సమ సమాజ వెలుగు ?
అపరాధాలు చేయకున్నా
తమపై మోపిన అవమానాలను
భరించలేక
గుండెల్లో మండే వ్యథలతో
అభివృద్ధి పథంలో ముందుకు పోలేక

ఇదేదో గట్టి చిక్కులో పడబోతున్నామని చెప్పడానికి సందేహించారు.

"ఫరవాలేదు! చెప్పండి!" సాధ్యమైనంత సౌమ్యంగా అడిగాడు.

"వాడా!... వాడు... కాళిదాసండీ."

"వాడు తిరిగి మీకు తీసుకున్న డబ్బు యివ్వడు కదూ ?"—

"అబ్బే లేదండీ! యిచ్చేస్తాడు" యిద్దరూ నసిగారు.

"లేదు! యివ్వడు — మీరు అడగనూ లేరు — అవునా ?"

హెడ్‌గారికి విషయమంతా తెలుసులా ఉంది. ముందుకెళ్తే నుయ్యి, వెనక్కొస్తే గొయ్యిలా ఉంది వాళ్ల పరిస్థితి. మౌనం వహించారు.

"అవును! నాకంతా తెలుసు!" వాడంటే మీ కెందుకంత భయం ?..."

వాళ్లు సమాధానం చెప్పలేదు.

"మరేం ఫరవాలేదు, నిన్న జరిగినది ఒక రిపోర్టు రాసి యివ్వండి. వాడి సంగతి నేను చూస్తాను." అనునయంగా, దృఢంగా అన్నాడు వెంకటస్వామి.

ఉలిక్కిపడ్డారు యిద్దరూ. ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు. వాళ్ల కళ్ళల్లో భయం స్పష్టంగా కనిపిస్తుంది.

"ఎందుకు భయం ? అందరూ అలా ఊరు కుంటే వాడిని వంచేదెవరు ? మేము, మా డిపార్టు మెంటు ఉండి ఏం లాభం ?"

దానికి సమాధానం చెప్పలేదు.

"రిపోర్టు యిస్తారా ? యివ్వరా ?" కొంచెం కటువుగా అడిగాడు.

"క్షమించండి బాబూ! ఆ పని మావల్ల కాదు. పిల్లా పాపల్తో ఉన్నాం. వాడిమీద రిపోర్టు యిచ్చి మా ప్రాణంమీదికి తెచ్చుకోలేము. ఎలా జరిగితే అలా జరుగుతుంది. మీరు మమ్మల్ని యిరుకులో పెట్టకండి" ప్రాధేయపడుతూ అన్నారు.

"నా మాట నమ్మండి! మీరు రిపోర్టు యిచ్చి నట్టు మూడో కంటికి తెలియనివ్వను. మీరు రిపోర్టు యిచ్చిన మరుక్షణం వాడ్ని లాకప్‌లో ఉంచి పార్వతీపురం పంపేస్తాను. వాడిమీద పాత కేసులు ఉన్నాయికదా! దీంతో అవి అన్నీ కెలికి ఊరికి వాడి పీడ లేకుండా చేస్తాను."

"మీరేం చెప్పినా చేస్తాంగాని వాడిమీద రిపోర్టు మాత్రం యివ్వం. మా మానాన్ని మమ్మల్ని ఉండనివ్వండి" అన్నారు యిద్దరూ ఏక కంఠంతో.

వెంకటస్వామి ఎన్ని విధాలో నచ్చచెప్పాడు. కాని వాళ్లు ససేమిరా వినలేదు. వెంకటస్వామి విసిగిపోయి ఆలోచనలో పడ్డాడు. అదను చూసి యిద్దరూ శలవు పుచ్చుకున్నారు.

"చూశారా సార్! నేను చెప్తే నమ్మలేదు. వాడంటే ఊళ్లోవాళ్లందరికి సింహస్వప్నం, వాడి ఎదురుగా నిలబడలేనివాళ్లు వాడిమీద రిపోర్టు యిస్తారా ?" అంతవరకు మౌనంగా వింటున్న కనకారావు అన్నాడు.

రిపోర్టు లేందే ఏం చెయ్యలేడు. ఊళ్లో వాళ్లెవరూ వాడిమీద రిపోర్టు యివ్వరు. వాడ్ని ఎలా పట్టుకోవటం, మరి తన యస్. ఐ. ప్రమోషను సంగతి ఏమిటి ?... ఆలోచిస్తున్నాడు వెంకట స్వామి. ఏ దారి కనపడటంలేదు.

రోజులు గడిచిపోతున్నాయి. రాత్రింపగళ్లు కాళిదాసును గురించే ఆలోచిస్తున్నాడు వెంకటస్వామి. ఎలాగైనా కాళిదాసుని జైలుకి పంపి యస్. ఐ. ప్రమోషన్ కొట్టేద్దామని ఎన్నో విధాల ఆలో చిస్తున్నాడు.

ఆ రోజు పేపరు చదువుతున్నాడు వెంకట స్వామి. ఇంతలో పార్వతీపురం నుండి ఒక కానిస్టే బులు వచ్చి ఒక కవరు యిచ్చాడు. అది పార్వతీపురం తాలూకా యస్. ఐ. దగ్గర్నుండి వచ్చింది. కవరు విప్పి చూశాడు. పార్వతీపురంలో ఒక సైకిలు పోయినట్టు, అది కాళిదాసే దొంగిలించాడని అనుమా నంగా ఉందని ఆ సైకిలు గుర్తులు యిచ్చి ఎంక్వయిరీ చెయ్యమని ఉంది.

కొండంత ఉత్సాహం వచ్చింది వెంకటస్వామికి. వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లయింది. తుపాకీకి తగిలించి ఉన్న బాయ్‌నెట్ తీసి మొల్లో దోపు కున్నాడు. కనకారావుని పిల్చి స్టేషను బయటికి వచ్చాడు.

"రౌడీ కాళిగాడి యిల్లెక్కడ ?" అడిగాడు వెంకటస్వామి.

"ఎందుకు సార్ ?" వణుకుతున్నాడు కనకారావు.

"పద ముందు!" గర్జించాడు వెంకటస్వామి.

తనకు దగ్గిరపడిందనుకున్నాడు కనకారావు. ఏదో చెప్పబోయి వెంకటస్వామి ముఖంలోకి చూశాడు. ఆ ముఖంలోని తీక్షణతకి తట్టుకోలేక ముఖం ప్రక్కకి తిప్పి దేవుడిమీద భారం వేసి ముందుకు దారితీశాడు కనకారావు.

కాళిదాసు యిల్లు తాటికమ్మలతో నెయ్యబడి ఒంటరిగా ఉంది యింటి ముందు పెద్ద చింత చెట్టు ఉంది. యిద్దరూ యింటి దగ్గరికి వచ్చారు. యింటి తలుపు గొళ్లెం వేసి ఉంది. అరుగుమీద సైకిలు స్టాండు వేసి ఉంది. జేబులోంచి కాయితం తీసి అందులో గుర్తులు ఈ సైకిలు గుర్తులు పోల్చి చూశాడు వెంకటస్వామి. రెండూ. సరి పోయాయి.

"కనకారావ్! సైకిలు పట్టుకో" ఆజ్ఞా పించాడు.

పాముని చూసినట్టు సైకిల్ని చూశాడు కనకారావు. వణుకుతున్న చేతుల్తో సైకిల్ని పట్టు కున్నాడు. సైకిల్ని నడిపించుకు తెచ్చి స్టేషన్‌లో పెట్టాడు. ఆ తరువాత ఓ కొండంత భారం తగ్గినట్టనిపించింది కనకారావుకి. మధ్యదార్లో కాళిదాసు కనబడనందుకు సంతోషించాడు.

సాయంత్రం పావు తక్కువ ఏడు గంట లయింది. మత్తుగా తాగి తూలుతూ పోలీసు స్టేషనుకి వచ్చాడు కాళిదాసు. హరికేన్ లాంతరు వెలుగులో కాళిదాసు మొల్లో మెరుస్తున్న చురకత్తిని చూసిన కనకారావు గుండె దడ దడ కొట్టుకొంది. వెంకటస్వామి మాత్రం తొణకలేదు, బెణకలేదు. స్థిమితంగా కుర్చీలో కూచున్నాడు.

"రే! ఎవ్రడా నా సైకిలు యిక్కడ తెచ్చి పెట్టాడు?" సైకిల్ని వెంకటస్వామిని మార్చి మార్చి చూస్తూ అన్నాడు కాళిదాసు.

"నేనే!" గంభీరంగా అన్నాడు వెంకటస్వామి.

"ఎందుకు బే తెచ్చావు ?"

"మర్యాదగా మాట్లాడు, అది నీది కాదు గనుక! నీవు దొంగిలించావు గనుక!"

"దొంగలాడ్డమే నా పని, కొనడం నా కలవాటు లేదు."

"నీలాటివాళ్లను వదలడం నాకూ అలవాటు లేదు."

పెంకు లదిరిపోయేలా నవ్వాడు కాళిదాసు.

"నీలాటోర్ని శానామందిని నూశాను!" సైకిలు తీసికెల్తాను. ఏటి సేత్తావో సేస్కో!" అంటూ సైకిలువైపు నడిచాడు కాళిదాసు.

"ఆగు! సైకిలుమీద చెయ్యి వేశావా పళ్ళు రాల్తాయి."

"రే! నోర్మూయ్ నా కొడకా! యిదిగోరా... సెయ్యేసేను — దమ్ముంటే రారా!"

వెంకటస్వామిలో ఆవేశం ముంచుకొచ్చింది. ఒక్కుదుటన లేచి కాళిదాసుమీద పడ్డాడు. అప్పటికే చురకత్తి తీసి రడీగా పట్టుకున్న కాళిదాసు విసురుగా కత్తితో పొడిచాడు. అది సరిగ్గా వెంకటస్వామి డొక్కలో దిగవలసిందే. కాని చేత్తో అడ్డుకోవటం వల్ల మోచేతిలో దిగబడిపోయింది.

"తెలిసిందిరా నా కొడకా!" కాళిదాసంటే ఏటో."

వెంకటస్వామిలో అహం దెబ్బతింది. ఒకప్రక్క యస్. ఐ. ప్రమోషను...మరొక ప్రక్క ప్రాణం... అభిమానం తలెత్తింది. ఛీ!... ఒక రౌడీ వెధవకి జడిసి పిరికిపందలా ఊరుకోవడమా ?... పోలీసన్న పేరుకే నామోషి. పౌరుషం పరవళ్లు త్రొక్కింది. ఎదురుగా మూలగా నిలబెట్టిన తుపాకివైపు కదిలాడు వెంకటస్వామి. అది గ్రహించాడు కాళిదాసు. వెంటనే మళ్లీ కత్తి విసిరాడు. ఈసారి వీపుకి కుడిప్రక్క భుజంలో దిగింది కత్తి. సుళ్లున రక్తం చిమ్మింది. రక్తాన్ని చూసిన వెంకటస్వామి కళ్ళు రక్తంకన్నా ఎరుపెక్కాయి. ముందుకు తిరిగాడు.

—శ్యామల తారారెడ్డి

అన్యాయాల అడవిలో నిలువలేక
అక్రమాల ఆచారాల బంధంలో
బ్రతకలేక చావలేక
నలిగిపోతున్న అమాయకులు
ఆచారాలు చేసే అన్యాయాలకు
బలి అవుతున్నారు గొర్రెల్లా
మన మతం ఎన్నడూ
మన సోదరుల్ని
నీచంగా చూడమని
కాలితో రాయమని చెప్పలేదు.
స్వంత లాభాలకు
ఆచారాలను అడ్డుపెట్టుకొనే
గోముఖ వ్యాఘ్రాలను
బ్రతుకులు బట్టబయలు చేయకుంటే
మరి ఎలా వస్తుంది సమానత్వం
మనిషి మనిషిగా మరెలా మనగిలడు ?

మళ్లా కత్తి విసిరాడు. ఈసారి గుండెల్లో దిగవలసిన కత్తి ప్రక్కకి జరగడంతో ఎడం దండలో దిగింది.

రక్తం ధారాపాతంగా కారిపోతుంది. బట్టలన్నీ రక్తమయం అయిపోయాయి. ఆ సన్నని హరికేన్ లాంతరు వెలుగులో వెంకటస్వామి ఆకారం భయంకరంగా కనిపిస్తుంది. అది చూసిన కనకారావు చలిజ్వరం వచ్చినవాడిలా వణికిపోతున్నాడు. అరవాలంటే మూలుగు తప్ప గొంతు పెగలడంలేదు.

అంత బాధనూ ఓర్చుకుంటున్నాడు వెంకటస్వామి. లాభం లేదు. సమయం మించిపోతుంది. ఏదో ఒకటి చెయ్యాలి. ప్రాణం పోయినా కాళిగాడ్ని వదలకూడదు. మళ్లీ కాళిదాసు కత్తిని గొంతుక్కి గురిపెట్టాడు. కత్తి విసిరేలోగా పక్కకి తప్పుకొని బలాన్నంతా కూడదీసుకొని బూటుకాలితో చాచి డొక్కలో తన్నాడు వెంకటస్వామి. ఆ దెబ్బతో పెద్దగా మూలిగి తూలి సైకిల్ని గుద్ది కింద పడ్డాడు. కాళిదాసు మీద సైకిలు పడింది. చేతిలోంచి కత్తి తుళ్లిపోయింది. సైకిలు మీద పడటంతో వెంటనే లేవలేకపోయాడు కాళిదాసు. ఆ అదను చూసి గెడ్డం క్రింది కసిదీరా తన్నాడు. నోట్లోనుండి గుక్కెడు రక్తం వచ్చింది. లేవబోతున్న కాళిదాసు ముఖంమీద ఫెడీలుమని మళ్లీ తన్నాడు. ఈసారి కళ్లముందు మెరుపు మెరిసినట్టు అనిపించి తల వేలాడేశాడు కాళిదాసు. స్పృహపోయింది.

"కనకారావ్!" పిల్చాడు వెంకటస్వామి నీర్సంగా. రక్తం ధారాపాతంగా కారిపోతుంది. కళ్లు మూసుకుపోతున్నట్టనిపించింది.

"ముందు వాడికి బేడీలు తగిలించి లాకప్ రూములోకి ఈడ్చి తలుపెయ్యి."

కళ్ళు మూతలు పడుతున్నాయి, శరీరం తూలిపోతుంది. యిక నిలబడలేకపోయాడు వెంకటస్వామి. బెంచీమీద కూర్చోబోతూ క్రింద పడిపోయాడు. గదంతా రక్తమయం అయిపోయింది. రక్తంలో వెంకటస్వామి తేలుతున్నట్టనిపించింది కనకారావుకి. ఆ దృశ్యం చూస్తున్న కనకారావుకి కడుపు తరుక్కుపోయింది. కళ్ళు చెమర్చాయి. వెంటనే కర్తవ్యం గుర్తుకు వచ్చి ఒక కానిస్టేబుల్ని సైకిలుమీద హుటాహుటిని పార్వతీపురం పంపాడు. ఊర్లో ఉన్న ఆర్. యం. పి. డాక్టరికి కబురుపెట్టి ప్రథమ చికిత్స చేయించాడు. ఊరి జనమంతా వచ్చి చేరారు. అందరూ వెంకటస్వామి సాహసాన్ని మెచ్చుకున్నారు. ఊరికి కాళిదాసు పీడ వదిలినందుకు సంతోషించారు. వెంకటస్వామికి ప్రాణం నిలపమని భగవంతుడ్ని ప్రార్థించారు.

గంటంపావులో పార్వతీపురం నుండి పోలీసు వేను వచ్చి ఆగింది. అందులోంచి ఒక సి. ఐ. యస్. ఐ. ఆరుగురు కానిస్టేబుల్లు, ఒక డాక్టరు దిగారు.

డాక్టరు వెంకటస్వామిని పరీక్షించి రెండు యింజక్షన్లు యిచ్చి "ప్రాణ భయం లేదు! కాని చాలా రక్తం పోయింది. కోలుకోడానికి చాలా టైము పడుతుంది" అన్నాడు.

వెంకటస్వామికి ప్రాణ భయం లేదనగానే ఊళ్లోవాళ్లందరు ముఖ్యంగా కనకారావు సంతోషించాడు.

వెంకటస్వామిని పార్వతీపురం గవర్నమెంటు ఆసుపత్రిలో జాయిన్ చేసారు. వెంకటస్వామికి రెండు రోజులు తరువాత తెలివి వచ్చింది. కళ్ళు విప్పగానే ముందు కనకారావు కనిపించాడు.

"సార్! మీరు గొప్ప ధైర్యం చేశారు, ఆఫీసర్లు ఊరి జనమంతా గొప్పగా చెప్పుకుంటున్నారు. మీకు తప్పకుండా ఈ దెబ్బతో యస్. ఐ. ప్రమోషను వస్తుందంటున్నారు సి. ఐ. గారు."

ఆ మాట వినగానే వెంకటస్వామి ముఖంమీద చిరునవ్వు వెలిగింది.

"సార్! మిమ్మల్ని చూడ్డానికి రేపు యస్. పి. దొరగారు వస్తున్నారట."

నిజమా అన్నట్టు చూశాడు వెంకటస్వామి.

తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు. తనకు తప్పకుండా యస్. ఐ. ప్రమోషను వస్తుంది.

మర్నాడు యస్. పి. వచ్చి వెంకటస్వామిని చూశాడు. శ్రద్ధగా చూడమని డాక్టరుకి చెప్పాడు. ఏది కావలిస్తే అది వెంటనే ఏర్పాటు చెయ్యమని క్రింది ఆఫీసర్లని హెచ్చరించాడు. వెంకటస్వామిని యెంతగానో అభినందించాడు. స్ట్రాంగుగా యస్. ఐ. ప్రమోషనుకి రికమెండు చేస్తానన్నాడు. దాంతో వెంకటస్వామికి కొండంత ఉత్సాహం వచ్చింది.

"తమ దయ సార్!" గొంతు చాలా నీర్సంగా వుంది.

"మరేం ఫరవాలేదు. ధైర్యంగా, సంతోషంగా వుండు. మన డిపార్టుమెంటు అంతా నీతరువున వుంది." అని ధైర్యం చెప్పి, యస్. పి. వెళ్లిపోయాడు.

నెలరోజులు ఆసుపత్రిలో వుండి కోలుకొని డిశ్చార్జి అయ్యాడు వెంకటస్వామి. ఆ తరువాత మరొక నెల యింటిదగ్గరే వుండి విశ్రాంతి తీసుకొని తరువాత డ్యూటీలో జాయిన్ అయ్యాడు. ఈ రెండు నెలలు యెంతో ఆత్రుతగా యెదురు చూశాడు ప్రమోషను వస్తుందేమోనని. కానీ ఏ కబురు తెలియలేదు. అలా మరొక నెల గడిచిపోయింది. వెంకటస్వామిలో నిరుత్సాహం చోటు చేసుకుంది. మధ్య మధ్య కనకారావు తప్పకుండా ప్రమోషను వస్తుందని ధైర్యం చెపుతునేవున్నాడు. అయినా వెంకటస్వామిలో ఆశ సన్నగిల్లిపోతుంది. తను ప్రాణాలకు తెగించి పడ్డ యింతా శ్రమా ఫలితంలేకుండా పోయినందుకు యెంతో విచారించాడు వెంకటస్వామి.

మోచేతిమీద గాయపు మచ్చని చూస్తూ కూచున్నాడు వెంకటస్వామి. ఇంతలో పరుగు నడకమీద వచ్చిన కనకారావు గోధుమరంగులో వున్న చిన్న కవరు అందించాడు.

"ఐ. జి నుండి సార్! తప్పకుండా ప్రమోషనే!" సంతోషంగా అన్నాడు కనకారావు.

ఒణుకుతున్న చేతుల్తో కవరు విప్పాడు వెంకటస్వామి. అందులో అరఠావు పావుఠావు కాయితాలు రెండు వున్నాయి. ముందు అరఠావు కాయితం తీసి చదవసాగాడు వెంకటస్వామి.

"డియర్ వెంకటస్వామి!" చదువుతున్న వెంకటస్వామి ముఖం చాటంత అయింది. కనకారావు ఆత్రుతగా వెంకటస్వామి ముఖంలోకి చూస్తున్నాడు.

అది వెంకటస్వామి ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించి పోలీసు డిపార్టుమెంటు పేరు ప్రతిష్టలు నిలబెట్టినందుకు ఐ. జి. దగ్గర్నుండి వచ్చిన ప్రశంసాపత్రము.

రెండో కాగితాన్ని తప్పకుండా ప్రమోషనుదే అయివుంటుందని చదవసాగాడు వెంకటస్వామి. చదువుతున్న వెంకటస్వామి ముఖంలో రంగులు మారడం కనకారావు గమనిస్తునేవున్నాడు. అంతా చదివిన వెంకటస్వామి ముఖంలో కత్తివేటుకు నెత్తురు లేకుండా పోయింది. చేతిలోంచి జారిపోతున్న కాగితాన్ని అందుకున్నాడు కనకారావు. కూడబలుక్కుని చదవసాగాడు.

వెంకటస్వామి డ్యూటీలో చూపిన అసమాన ధైర్యసాహసాలకు మెచ్చి అతడి సేవకి ప్రతిఫలంగా పోలీసు డిపార్టుమెంటు వెంకటస్వామికి అక్షరాలా యాభై రూపాయల నగదు బహుమతి నివ్వడానికి సంతోషిస్తుంది.

కుర్చీలో జారగిలపడిన వెంకటస్వామి ముఖంలోకి చూడలేక బయటికి వెళిపోయాడు కనకారావు. ●

## ర చ యి త ల కు వి జ్ఞ ప్తి

★ ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రచురణకు పరిశీలనార్థం మా కార్యాలయానికి చాలా ఎక్కువ సంఖ్యలో రచనలు, బొమ్మలు వస్తూంటాయి. నిబంధనలు పాటించి రచయితలు మాతో సహకరిస్తే తప్ప – ఆయా రచనల వైనం వారికి తెలియజేయడం సాధ్యం కాదని మేము పదే పదే విజ్ఞప్తి చేయటానికి కారణంకూడా అదే.

మా కార్యాలయానికి స్వయంగా వచ్చి రచనలు, కార్టూన్లు అందజేసేవారుకూడా పరిశీలనానంతరం వాటి వైనం తెలుసుకునేటందుకు తమ రచనలతో పాటు స్వంత చిరునామాగల స్టాంపు అతికించిన కవరు వుంచడం అవసరం. రచనపై అంగీకారం కాని, అనంగీకారంకాని ఆయా రచయితలకు తెలుపటానికి కనీసం ఆరు వారాలు పట్టవచ్చును. అది కూడా పోస్టు ద్వారా తెలియజేయడమే సాధ్యం.

★ రచనలతోగాక, విడిగా స్టాంపులు పంపడం, స్వయంగా వచ్చి రచనలు, కార్టూన్లు యివ్వమని కోరడం చాలామంది చేస్తుంటారు. ఇది చాలా యిబ్బంది కలిగించుతుంటుంది కనుక – తమ రచనతో లేదా బొమ్మలతో స్వంత చిరునామా, హామీ పత్రం మున్నగునవి, జత చేసి యివ్వడం లేక పంపడం చాలా అవసరం.

★ కార్టూన్లు పంపేవారు వారికి తిరస్కరింపబడిన కార్టూన్లు తిరిగి కావాలనుకుంటే స్వంత చిరునామాగల స్టాంపు అతికించిన కవరు జత చేసి తీరాలి.

—సం.